సాక్షి ఆదిలాబాద్

సోమవారం । 31 । మార్చి । 2025



నేడే రంజాన్ 8లో▸

పవిత్ర రంజాన్ ఉపవాస దీక్షలు ఆదివారంతో ముగిశాయి. సోమవారం పండుగ జరుపుకునేందుకు ముస్లింలు సిద్ధమయ్యారు.



గ్రూప్-1లో మనోళ్ల సత్తా

గ్రూప్-1 ఫలితాల జాబితాను టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. ఇందులో ఉమ్మడి జిల్లా వాసులు సత్తా చాటారు. 8లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 39.0/25.0

వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరగనున్నాయి. మధ్యాహ్నం ఎండ తీవ్రతతో పాటు ఉక్కపోత ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

ఈద్గా వద్ద పటిష్ట బందోబస్తు



ఈద్గా మైదానాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని ఈద్గా మైదానంతో పాటు అన్ని మసీదులు, ముఖ్యమైన ప్రదేశాల్లో పికెట్స్ ఏర్పాటు చేసినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. సోమవారం రంజాన్ సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఈద్గా మైదానాన్ని ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పట్టణంలోని ఆయా ప్రాంతాల్లో దాదాపు 250 మంది సిబ్బందితో పకడ్బందీ బందోబస్తు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎస్పీ వెంట ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి, వన్‌టౌన్, టూటౌన్ సీఐలు సునీల్‌కుమార్, కరుణాకర్‌రావు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ మహేందర్, సిబ్బంది ఉన్నారు.

ప్రైవేట్ వ్యక్తులు వాహనాల తనిఖీ చేపట్టొద్దు

ఆదిలాబాద్‌టౌన్: ప్రైవేట్ వ్యక్తులకు వాహనాలను ఆపే అధికారం లేదని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి అన్నారు. డీఎస్పీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రైవేట్ వ్యక్తులు వాహనాలను ఆపినా, తనిఖీలు చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. శనివారం భోరజ్ చెక్‌పోస్టు వద్ద ఓ ఎంవీఐ వాహన తనిఖీలు చేపట్టగా ఆయన ప్రైవేట్ డ్రైవర్ వాహనాలను ఆపి ధ్రువీకరణ పత్రాలను అడగగా, హైవే పెట్రోలింగ్ సిబ్బంది గమనించి జైనథ్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా చెక్‌పోస్టులు, టోల్‌ప్లాజాల వద్ద ప్రైవేట్ వ్యక్తులు వాహనాలు ఆపడానికి, తనిఖీలు చేపట్టేందుకు అనుమతులు లేవని స్పష్టం చేశారు. ఒకవేళ నిబంధనలు అతిక్రమిస్తే తనిఖీలకు పాల్పడిన వారితో పాటు సంబంధిత అధికారిపై కూడా చర్యలు తప్పవని హెచ్చరించారు.

12వ రోజుకు 'సీపీఐ' దీక్షలు




దీక్షలో కూర్చున్న కమిటీ సభ్యులు

కైలాస్‌నగర్: మూతపడ్డ ఆదిలాబాద్ సిమెంట్ ఫ్యాక్టరీని పునః ప్రారంభించాలనే డిమాండ్‌తో సీసీఐ సాధన కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రిలే దీక్షలు 12వ రోజుకు చేరాయి. ఆదివారం నాటి దీక్షల్లో కమిటీ కన్వీనర్ మల్లేశ్, కో-కన్వీనర్లు నారాయణ,అరుణ్‌కుమార్, దత్తాత్రి, ప్రభాకర్‌రెడ్డి, జగన్, ఈశ్వర్, ఆశన్న కూర్చున్నారు. ఉగాది పండుగ కావడంతో శిబిరం వద్దే షడ్రుచుల పచ్చడి స్వీకరించారు.

ఆస్తి పన్ను బకాయిలపై 90శాతం వడ్డీ మాఫీ

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో ఆస్తి పన్ను చెల్లించని మొండి బకాయిదారులకు ప్రభుత్వం ఊరటనిచ్చింది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్ను బకాయిలు పూర్తిగా చెల్లించే వారికి వాటిపై ఉన్న వడ్డీ 90శాతం మాఫీ చేయనుంది. అయితే ఈ నెల 31వరకు చెల్లించే వారికి మాత్రమే ఈ మాఫీ వర్తించనుందని మున్సిపల్ అధికారులు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వృద్ధుల సంరక్షణే ధ్యేయం



వృద్ధులను సత్కరిస్తున్న సంఘం సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: వృద్ధుల సంరక్షణే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని వయో వృద్ధుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు డాక్టర్ దేవిదాస్ దేశ్‌పాండే అన్నారు. ఉగాది పండుగ సందర్భంగా జిల్లా కేంద్రంలోని భుక్తాపూర్‌లో 70 ఏళ్లు నిండిన వృద్ధులను ఆదివారం సన్మానించారు. బండారి రాజమ్మ, వై.రాములు, వై.సరోజినిదేవి, లక్ష్మి, సమ్మక్క, విజయలక్ష్మిలకు ఔషధ మొక్కలు అందజేసి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నర్సింలు, దేవాసింగ్, వెంకటి, ప్రకాశ్, ఈర్ల సత్యనారాయణ, పాశం రాఘవేంద్ర, కంది శ్రీనివాసరెడ్డి, నాగేశ్వర్, రాజేశ్ పాల్గొన్నారు.

పంచాంగ పఠనం చేస్తున్న సిద్ధాంతి



వ్యవసాయ క్షేత్రంలో బసవన్నలతో ఎమ్మెల్యే అనిల్ జాదవ్



ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్





ఉగాది పచ్చడి, బూరెల పంపిణీలో ఎమ్మెల్యే శంకర్

విశ్వావసును స్వాగతిస్తూ

- వైభవంగా ఉగాది వేడుకలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- పంచాంగం వినిపించిన పండితులు

ఆదిలాబాద్: జిల్లావాసులు ఉగాది వేడుకలను ఆదివారం వైభవంగా నిర్వహించుకున్నారు. విశ్వావసు నామ సంవత్సరానికి స్వాగతం పలికారు. వేకువజాము నుంచే ఆలయాలకు చేరుకుని పూజలు చేశారు. ఈ ఏడాది శుభాలు కలగాలని, పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని కోరుకున్నారు. ప్రతీ ఇల్లు మామిడి తోరణాలతో కళకళలాడగా.. షడ్రుచుల పచ్చడి, బూరెలు, గుడాలు వంటి వంటకాలతో ఘుమఘుమలాడింది. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో రైతులు తమ పంట చేలల్లో పూజలు చేసి, వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు. జిల్లా కేంద్రంలోని శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠంలో సనాతన హిందూ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉగాది పచ్చడి పంపిణీ కార్యక్రమంలో ఎస్పీ అఖిల్ మహాజన్, మఠాధిపతి యోగానంద సరస్వతి స్వామిజీ పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని వినాయక చౌక్‌లో శ్రీ రామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉగాది పచ్చడి పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్ పాల్గొని ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. కైలాస్‌నగర్ కాలనీలోని ఆంజనేయస్వామి ఆలయంలో చికిలి లక్ష్మి వెంకటేశ్వర సిద్ధాంతి పంచాంగ పఠనం చేశారు. అలాగే పలువురు మహారాష్ట్రవాసులు గుడిపడ్వా వేడుకలను జరుపుకున్నారు.



మహా గణపతి ఆలయంలో భక్తుల సందడి

నేరడిగొండ: బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తన స్వగ్రామం రాజురలో గల వ్యవసాయ క్షేత్రంలో ప్రత్యేక పూజలు చేశారు. కుటుంబ సమేతంగా బసవన్నలకు నైవేద్యం సమర్పించారు.

కుళ్లిన భోజనమైనా.. ఘుమఘుమలే!

జిల్లా కేంద్రంలోని ఓ హోటల్‌లో లభ్యమైన కుళ్లిన మాంసంపై ఫినాయిల్ చల్లుతున్న అధికారులు (ఫైల్)



- గతేడాది నవంబర్‌లో ఆదిలాబాద్‌లోని పలు హోటళ్లు, స్వీట్ షాపులను రాష్ట్ర స్థాయి ఫుడ్‌సేఫ్టీ అధికారులు తనిఖీ చేశారు. ఇందులో విస్తుపోయే విషయాలు బయటపడ్డాయి. రోజుల తరబడి ఉంచిన ఆహార పదార్థాలు, స్వీట్ షాపుల్లో రసాయనాల వాడకం, ఫ్రిజ్‌లో బూజు పట్టిన మాంసం, కిచెన్‌లో అపరిశుభ్రత దర్శనమిచ్చాయి. శాంపిళ్లను సైతం తీసుకెళ్లారు. దుర్గంధం వెదజల్లే పదార్థాలపై ఘుమఘుమ లాడే రసాయనాలు వేయడంతో ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతోంది.
- ఆదిలాబాద్ పట్టణంలోని ఓ బిర్యానీ హౌస్‌ను మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్, పలువురు అధికారులు ఇటీవల తనిఖీ చేశారు. కిచెన్ అపరిశుభ్రంగా ఉండడంతో నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే హోటల్‌లో కుళ్లిన మాంసం, మరో స్వీట్ షాపులో చెడిపోయిన పదార్థాలు ఉండడంతో రెండు షాపులకు రూ.5వేల చొప్పున జరిమానా విధించారు. నోటీసులు జారీ చేశారు. మరోసారి పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

- హోటళ్లు, స్వీట్‌షాపుల్లో అపరిశుభ్ర ఆహారం
- రోజుల తరబడి ఫ్రిజ్‌లో మాంసపు నిల్వలు
- వాడిన నూనె మళ్లీ వినియోగం
- ప్రజారోగ్యంతో నిర్వాహకుల చెలగాటం
- నామమాత్రపు తనిఖీలకే అధికారులు పరిమితం

ఆదిలాబాద్‌టౌన్: స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలిసి రెస్టారెంట్, హోటల్‌కు వెళ్తున్నారా.. వారితో కలిసి మిఠాయిలు తింటూ ఆనందం పంచుకుంటున్నారా.. అయితే ఒక్కక్షణం ఆలోచించండి. మీరు తినే ఆహారం ఎంత నాణ్యమైనదో తెలుసుకుంటే జీవితంలో వాటి ఊసెత్తరంటే అతిశయోక్తి కాదు. జిల్లాలోని పలు హోటళ్లు, స్వీట్ షాపుల్లో కుళ్లిన పదార్థాలను వినియోగిస్తున్నారు. పైన పటారం.. లోన లొటారం అన్న చందంగా మారింది వాటి తీరు. మాంసంను రోజుల తరబడి ఫ్రిజ్‌లో నిల్వ ఉంచడం, స్వీట్ షాపుల్లో రసాయనాలు వాడటం, వాడిన నూనెనే మళ్లీ మళ్లీ వినియోగించడంతో ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతోంది. నిర్మల్ జిల్లాలోని ఓ హోటల్‌లో గతేడాది జిల్లాకు చెందిన ఓ యువతి భోజనం చేసిన అనంతరం వాంతులు చేసుకొని మృత్యువాత పడిన విషయం విదితమే. ఆమెతో పాటు భోజనం చేసిన పలువురు అస్వస్థతకు గురయ్యారు. అయినా చాలా హోటళ్లు, స్వీట్ షాపుల నిర్వాహకుల్లో మాత్రం మార్పు రావడం లేదు. ధనార్జనే ధ్యేయంగా ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. అడపాదడపా తనిఖీలు చేసే అధికారులు ఇలాంటి వారిపై కఠిన చర్యలు కాకుండా నామ్‌కే వాస్తే జరిమానా విధిస్తుండడంతో వారు మరింతగా రెచ్చిపోతున్నారు.

వాసన రాకుండా.. ట్రిక్‌లు

జిల్లా కేంద్రంలోని పలు హోటళ్లు, రెస్టారెంట్లు, స్వీట్ షాపుల్లోని కిచెన్లలో దుర్గంధం వెదజల్లుతోంది. కిచెన్ పరిస్థితి ప్రత్యక్షంగా చూస్తే మరోసారి అక్కడికి వెళ్లి తినాలనే కోరిక కూడా పుట్టదు. చాలా హోటళ్లలో చేసిన బిర్యానీ ఆ రోజు మిగిలితే అందులోని ముక్కలు తీసి మరుసటి రోజు వినియోగిస్తున్నారు. వాటిపై సువాసన వెదజల్లే రసాయనాలను చల్లుతున్నారు. వండిన ఆహార పదార్థాలు ఘుమ ఘుమ లాడేందుకు టేస్టింగ్ పౌడర్ వేస్తున్నారు. ఇలాంటి భోజనం చేస్తే క్యాన్సర్ బారిన పడే ప్రమాదం లేకపోలేదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

పత్తా లేని ఆహార తనిఖీ అధికారులు..

జిల్లాలో ఆహార తనిఖీ అధికారులు ఏళ్లుగా పత్తా లేకుండా పోయారు. వైద్య శాఖలో పనిచేస్తున్న ఎన్‌సీడీ అధికారికి డిసిగ్నేటెడ్ అధికారి బాధ్యతలు అప్పగించారు. అయితే ఈ కార్యాలయంలో ఒక డాటా ఎంట్రీ ఆపరేటర్, ఒక అటెండర్ మాత్రమే ఉన్నారు. సరిపడా సిబ్బంది లేకపోవడంతో ఏళ్లుగా తనిఖీలు చేపట్టడం లేదని తెలుస్తోంది. ఇటీవల మంచిర్యాలకు చెందిన ఎఫ్ఎస్‌వోకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించినా ఆయన అసలు తనిఖీలకే దూరంగా ఉన్నట్లు తెలుస్తోంది.

మిఠాయిల్లోనూ రసాయనాలే..

స్వీట్ హౌస్‌ల్లో తయారు చేసే మిఠాయిల్లోనూ ప్రమాదకర రసాయనాలను వినియోగిస్తున్నారు. వాడిన నూనెనే మళ్లీ వినియోగించడం, రుచి కోసం కెమికల్స్ వేయడం, కల్తీ పాలు, నెయ్యి, ఇతర పదార్థాలను కలుపుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. అలాగే చిన్న చిన్న హోటళ్లు, తోపుడు బండ్లపై తయారు చేసే ఆహార పదార్థాలకు సైతం కాగిన నూనెనే వినియోగిస్తుండడంతో జనం క్యాన్సర్, ఇతర రోగాల బారిన పడే ప్రమాదం ఉంటుందని వైద్యులు పేర్కొంటున్నారు.

నిరంతర తనిఖీలు చేస్తే..

ఇక ఫుడ్‌సేఫ్టీ అధికారులు ఏడాదికోసారి చుట్టపుచూపుగా తనిఖీలు చేసి మమా అనిపిస్తున్నారనే విమర్శలు లేకపోలేదు. జిల్లా కేంద్రంలో రెండు, మూడింటిని మాత్రమే తనిఖీ చేసి చేతులు దులుపుకుంటున్నారు. నిరంతరం తనిఖీలు చేపడితేనే ప్రజల ఆరోగ్యం కాపాడే విధంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

వారానికి రెండుసార్లు తనిఖీలు



జిల్లా కేంద్రంలోని హోటళ్లు, స్వీట్ షాపుల్లో వారానికి రెండుసార్లు తనిఖీలు చేపడతాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం. రెండు రోజుల క్రితం ఒక హోటల్, ఒక స్వీట్ షాపును తనిఖీ చేశాం. పరిశుభ్రత పాటించకపోవడంతో నోటీసులు జారీ చేశాం. రూ.5వేల చొప్పున జరిమానా విధించాం.

– నరేందర్, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఆదిలాబాద్

ఎఫ్ఎస్‌వో లేకపోవడంతో..



గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు లేని జిల్లాల్లో ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారులకు బాధ్యతలు అప్పగించారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో డాటాఎంట్రీ ఆపరేటర్, అటెండర్ మాత్రమే ఉన్నారు. కొంత కాలంగా ఎఫ్ఎస్‌వో లేరు. సిబ్బంది లేకపోవడంతో తనిఖీలు నిర్వహించలేకపోతున్నాం. ఉన్నతాధికారులకు విషయాన్ని తెలియజేశాం. తనిఖీలు చేపట్టి చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ శ్రీధర్, డిసిగ్నేటెడ్ ఫుడ్ అధికారి, ఆదిలాబాద్

తాగునీటి ఇబ్బందులు రానివ్వొద్దు

- మున్సిపల్ అధికారులకు ఎమ్మెల్యే 'పాయల్' ఆదేశం

కైలాస్‌నగర్: గతంతో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది భూగర్భజలాల మట్టం పడిపోవడం ఆందోళనకరమని, అయినా పట్టణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ అధికారులతో కలిసి పట్టణానికి తాగునీటిని అందించే లాండసాంగ్వీ పంపుహౌస్‌ను ఆదివారం పరిశీలించారు. మోటార్ల సామర్థ్యం వివరాలను కమిషనర్‌ను అడిగి తెలుసుకున్నారు. మరో 300 హెచ్‌పీ మోటార్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇరిగేషన్ అధికారులు, మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీతో మాట్లాడి వాగులో చెక్‌డ్యాంలు నిర్మించేందుకు వీలుగాఅనుమతులు, నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పట్టణంలో భూగర్భజలాల మట్టం భారీగా తగ్గిన నేపథ్యంలో ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. నీటి ఎద్దడి తీవ్రతరం కాకముందే అందుబాటులోని వనరులను వాడుకునేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు, డీఈలు తిరుపతి, కార్తీక్, బీజేపీ నాయకులు వేద వ్యాస్, రవి, లాలామున్నా, తదితరులున్నారు.



లాండసాంగ్వీ వాగును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

పెరిగిన 'ఉపాధి' కూలి

- మరో రూ.7 పెంచిన కేంద్రం
- రేపటి నుంచి అమల్లోకి..
- కూలీలకు ఉగాది కానుక

జిల్లాలో..
జాబ్‌కార్డులు : 2.23 లక్షలు
యాక్టివ్ జాబ్ కార్డులు : 1.36లక్షలు
నమోదు చేసుకున్న కూలీలు : 3.45లక్షలు
పనులకు వచ్చే కూలీలు : 2.17లక్షలు
వంద రోజులు పని పూర్తి చేసిన కుటుంబాలు : 4,063
వచ్చే ఆర్థిక సంవత్సర పనిదినాల లక్ష్యం : 51.79 లక్షలు



నేరడిగొండ మండలం వాంకిడి గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

కైలాస్‌నగర్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీలకు కేంద్ర ప్రభుత్వం ఉగాది కానుకను ప్రకటించింది. వారికిచ్చే కూలి పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండే ఏప్రిల్, మే నెలల్లో ఉపాధి పనులు ముమ్మరంగా సాగుతుంటాయి. ఈ సమయంలో పనులకు వచ్చే కూలీలకు ప్రయోజనం చేకూర్చేలా గతంలో కేంద్రం అదనపు భత్యం చెల్లించేది. అయితే రెండేళ్లుగా దీనిని నిలిపివేసింది. తాజాగా ఉపాధి కూలీలకు ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో దినసరి కూలి మరో రూ.7లకు పెంచింది. ఏప్రిల్ 1నుంచి అమలు చేయనున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయంతో జిల్లాలోని 2లక్షల మంది కూలీలకు లబ్ధి చేకూరనుంది.

రూ.307కు చేరిన కూలి

వలసలను అరికట్టి గ్రామీణ ప్రాంతాల్లోని కూలీలకు స్థానికంగానే వంద రోజుల పాటు పని కల్పించాలనే ఉద్దేశంతో 2005లో కాంగ్రెస్ ప్రభుత్వం ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకాన్ని ప్రవేశపెట్టింది. జాబ్‌కార్డు కలిగిన వారికి చెరువులు, కుంటలు, బావుల్లో పూడికతీత, హరితహారం కింద నర్సరీల నిర్వహణ, మొక్కలు నాటడం, సంరక్షించడం, వ్యవసాయ భూముల సంరక్షణ వంటి పనులను కల్పిస్తున్నారు. పథకం ప్రారంభంలో రోజు వారీ కూలి రూ.87.50గా చెల్లించేవారు. నిత్యావసరాల ధరలు పెరిగిన నేపథ్యంలో కూలీలకు లబ్ధి చేకూర్చేలా కూలి సైతం క్రమంగా పెంచుతూ వస్తోంది. 2022లో రూ.12 పెంచగా, 2023లో రూ.15 పెంచారు. గతేడాది అత్యధికంగా రూ.28లు పెంచడంతో రోజువారీ కూలి రూ.300కు చేరింది. తాజాగా మరో రూ.7 పెంచడంతో ఇది రూ.307కు చేరువైంది. ప్రస్తుతం రోజు వారీ సగటు కూలి రూ.238.77గా చెల్లిస్తున్నారు.

పెరుగనున్న కూలీల సంఖ్య

జిల్లాలో ప్రస్తుతం వ్యవసాయ పనులు పూర్తి కావస్తున్నాయి. దీంతో రైతులతో పాటు వ్యవసాయ కూలీలంతా ఉపాధి పనులపైనే ఆసక్తి చూపుతారు. వ్యవసాయ కూలీలకు ఆత్మీయ భరోసా పథకం అమలు చేయనుండటంతో కూలీల సంఖ్య భారీగా పెరిగే అవకాశముంది. దీంతో రానున్న రెండు నెలల పాటు ఉపాధి పనులు ముమ్మరంగా సాగనున్నాయి. ప్రతీ కూలీకి వంద రోజుల పని కల్పించేలా ప్రణాళికను సిద్ధం చేసిన అధికారులు తదనుగుణంగా బడ్జెట్ కేటాయించారు. ఈ పనులకు హాజరయ్యే కూలీలకు అవసరమైన పార, గడ్డపార, తట్టల కొనుగోలుకు కేంద్ర ప్రభుత్వం గతంలో అదనపు భత్యం చెల్లించేది. అయితే మూడేళ్లుగా దాన్ని నిలిపివేసింది. బదులుగా కూలి పెంచుతూ వస్తోంది.

రేపటి నుంచి అమలు

కేంద్ర ప్రభుత్వం పెంచిన దినసరి కూలి ఈ ఏప్రిల్ ఒకటి నుంచి అమల్లోకి రానుంది. దీంతో కూలీలకు ఆర్థికంగా కొంత లబ్ధి చేకూరనుంది. జాబ్‌కార్డు కలిగిన ప్రతీ కూలీకి వంద రోజుల పాటు పని కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం పెరుగుతున్న ఎండల తీవ్రతతో కూలీలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నాం.

– రవీందర్, డీఆర్డీవో, ఆదిలాబాద్

రాజీవ్ యువ వికాసానికి దరఖాస్తుల స్వీకరణ

కైలాస్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకం కింద స్వయం ఉపాధి కోసం జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ (ఈడబ్ల్యూఎస్)కులాలకు చెందిన నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ రాజర్షి షా ప్రకటనలో తెలిపారు. ఈ పథకం ద్వారా గరిష్ఠంగా రూ.4 లక్షల వరకు రుణం పొందవచ్చని పేర్కొన్నారు. రూ.50వేల లోపు విలువ చేసే యూనిట్‌కు వంద శాతం సబ్సిడీ వర్తిస్తుందని తెలిపారు. రూ.లక్ష లోపు యూనిట్‌కు 90 శాతం సబ్సిడీ, రూ.2 లక్షల యూనిట్‌కు 80 శాతం సబ్సిడీ, రూ.4 లక్షల వరకు గల యూనిట్‌కు 70 శాతం సబ్సిడీ వర్తిస్తుందని పేర్కొన్నారు. వ్యవసాయేతర పథకాల యూనిట్ల స్థాపనకు దరఖాస్తు చేసుకునే వారి వయస్సు 21నుంచి 55 ఏళ్ల లోపు ఉండాలని, అలాగే వ్యవసాయ ఆధారిత పథకాలకు దరఖాస్తు చేసే వారి వయస్సు 21నుంచి 60 ఏళ్లలోపు ఉండాలని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వారి కుటుంబ వార్షికాదాయం రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో వారయితే రూ.2లక్షల్లోపు ఉండాలని తెలిపారు. అలాగే బ్యాంక్ సమ్మతి తప్పనిసరి అని పేర్కొన్నారు. దరఖాస్తుకు ఆధార్ కార్డు, పాన్‌కార్డు, కుల, ఆదాయ, నివాస, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలతో పాటు బ్యాంకు ఖాతా తప్పనిసరిగా జతచేయాలని సూచించారు. ఆసక్తి గల వారు https:// tgobmmsnew. cgg. gov. in వెబ్‌సైట్ ద్వారా ఏప్రిల్ 5లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన దరఖాస్తుతో పాటు ధ్రువీకరణ పత్రాల ప్రతులను జత చేసి సంబంధిత ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో అందజేయాలని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన వారంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రంజాన్‌ను ఆనందంగా జరుపుకోవాలి

జిల్లాలోని ముస్లింలు రంజాన్ పండుగను ఆనందోత్సాహాల నడుమ జరుపుకోవాలని కలెక్టర్ రాజర్షి షా కోరారు. పవిత్ర మాసంలో ప్రతీ ముస్లిం నెల రోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలు చేపడతారని పేర్కొన్నారు. అల్లా ఆశీస్సులతో అందరికి శుభాలు కలగాలని ఆకాంక్షిస్తూ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.



క్లుప్తంగా

రైతుపై చిరుత దాడి



గాయపడిన రైతుతో ఫారెస్ట్ అధికారులు

తాంసి: రైతుపై చిరుత దాడి చేసిన ఘటన భీంపూర్ మండలం వడ్గాం పంచాయతీ పరిధి రాజ్‌ఘడ్‌లో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన రైతు గోడం తుకారం మరో వ్యక్తితో కలిసి ఆదివారం మధ్యాహ్నం అటవీ ప్రాంతం రాజ్‌ఘడ్ శివారులో పంట చేనుకు వెళ్లాడు. ఈక్రమంలో చిరుత ఒక్కసారిగా రైతుపై దాడి చేసింది. ఈదాడిలో ఆయన మెడ, తలకు గాయాలయ్యాయి. రైతు, మరో వ్యక్తి ప్రతిఘటించి, గట్టిగా కేకలు వేయడంతో చిరుత అక్కడి నుంచి వెళ్లింది. గాయపడిన రైతును అంబులెన్స్‌లో గ్రామస్తులు రిమ్స్‌కు తరలించారు. ఫారెస్ట్ సెక్షన్ అధికారి అహ్మద్‌ఖాన్, బీట్ అధికారి సాయికుమార్ బాధిత రైతును పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్య సిబ్బందిని సూచించారు. కాగా, ఘటన స్థలాన్ని పరిశీలించి రైతుపై దాడి చేసింది చిరుతానా, లేక వేరే అడవి జంతువు అనేది నిర్ధారించాల్సి ఉందని అహ్మద్‌ఖాన్ తెలిపారు.

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం

బజార్‌హత్నూర్: మండలంలోని మాడగూడ గ్రామంలో శనివారం రాత్రి ఆదివాసీ గిరిజన రైతు మడవి దినకర్ ఇల్లు ప్రమాదవశాత్తు దగ్ధమైంది. దినకర్ తన కుటుంబ సభ్యులు కట్టెల పొయ్యిపై వంట చేసుకుని భోజనం చేసి నిద్రపోయారు. ప్రమాదవశాత్తు పొయ్యిలోని నిప్పు ఇంటికి అంటుకుని మంటలు వ్యాపించాయి. కుటుంబ సభ్యులు కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి మంటలార్పివేశారు. ఘటన స్థలాన్ని ఆర్ఐ నూర్‌సింగ్ ఆదివారం పరిశీలించారు. రూ.52 వేల విలువ గల ఆస్తినష్టం వాటిల్లినట్లు నిర్ధారించారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరాడు. ఆర్ఐ వెంట మాజీ సర్పంచ్ మడవి ప్రకాశ్, గ్రామపటేల్ గెడం లక్ష్మణ్, సీతారాం, జంగు తదితరులు ఉన్నారు.

యువకుడు అదృశ్యం



రామేశ్వర్ (ఫైల్)

ఇంద్రవెల్లి: మండలంలోని గౌరపూర్ పంచాయతీ పరిధి మోహన్‌సింగ్‌తండాకు చెందిన యువకుడు సాబ్లే రామేశ్వర్ (24)అదృశ్యమయ్యాడు. కుటుంబీకులు, ఎస్సై సునీల్ తెలిపిన వివరాలు.. సాబ్లే రామేశ్వర్ ఈనెల 28న బ్యాంక్ పని నిమిత్తం కుటుంబీకుల చెప్పి ఆదిలాబాద్ వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబీకులు బంధువుల ఇళ్లలో, చుట్టుపక్కల గ్రామాల్లో గాలించినా ఆచూకీ దొరకలేదు. ఆదివారం సాయంత్రం తండ్రి సాబ్లే భోజ్‌రాజ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అలరించిన కుస్తీపోటీలు



పురుషుడితో కుస్తీపడుతున్న దేవకి

కుభీర్: ఉగాది పురస్కరించుకొని మండల కేంద్రంలోని విఠలేశ్వర ఆలయకమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతరాష్ట్ర కుస్తీపోటీలు అలరించాయి. తెలంగాణ నుంచి, మహారాష్ట్రలోని పలు గ్రామాలు నుంచి మల్లయోధులు పాల్గొన్నారు. చివరి కుస్తీ పోటీలో మహారాష్ట్రలోని హింగోలికి చెందిన బాలాజీ రూ.6 వేల నగదును గెలుచుకున్నారు. మహారాష్ట్రకు చెందిన ముగ్గురు బాలికలు సాయిశ్రీ, దేవకి, పల్లవిలు మగ పిల్లలతో కుస్తీపట్టి వారిని ఓడించి బహుమతులు గెలుచుకున్నారు.

బాసర వేద పండితుడికి ఉగాది పురస్కారం



పురస్కారం అందుకుంటున్న నవీన్‌శర్మ

బాసర: బాసర శ్రీ జ్ఞాన సరస్వతి ఆలయ ఆస్థాన సామవేద పండితుడు బ్రహ్మశ్రీ కందికోట నవీన్‌శర్మకు రాష్ట్ర ప్రభుత్వం ఉగాది పురస్కారం ప్రకటించింది. ఆదివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్ ఆయనకు ఈ పురస్కారం అందించారు. తనకు పురస్కారం రావడం ఆనందంగా ఉందని నవీన్‌శర్మ పేర్కొన్నారు.

గ్రూప్-1లో మనోళ్ల సత్తా

- జనరల్ ర్యాంకింగ్స్ జాబితాలో పలువురు..
- ఈ ర్యాంకుల ఆధారంగా సర్టిఫికెట్ వెరిఫికేషన్
- ఎంపికైనవారికి వ్యక్తిగతంగా సమాచారం

తెలంగాణలో గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష ఫలితాల్లో ప్రొవిజనల్ మార్కులు, జనరల్ ర్యాంకింగ్స్ జాబితాను తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఇటీవల విడుదల చేసింది. ఏడు పేపర్ల మార్కులు, జనరల్ ర్యాంకింగ్స్‌తో కూడిన జాబితాను వెబ్‌సైట్‌లో ప్రకటించారు. మార్కుల మెమోలు మార్చి 30 నుంచి ఏప్రిల్ 5 సాయంత్రం 5 గంటల వరకు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అభ్యర్థులు టీజీపీఎస్సీ ఐడీ, హాల్‌టికెట్ నంబర్, పుట్టిన తేదీ, ఓటీపీతో లాగిన్ చేసి మెమోలను పొందాలి. ఈ ర్యాంకుల ఆధారంగా అభ్యర్థులను సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు పిలుస్తామని టీజీపీఎస్సీ తెలిపింది. ఎంపికైనవారికి వ్యక్తిగతంగా సమాచారం అందజేస్తారని, అందుకోసం ఒరిజినల్ సర్టిఫికెట్లు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించింది. ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు యువకులు ర్యాంకులు సాధించారు. ఇందులో ఇప్పటికే కొందరు ప్రభుత్వ ఉద్యోగం చేస్తూనే ఉత్తమ ర్యాంక్‌లు సాధించడం గమనార్హం.

డీఎస్పీగా ఎంపికైన మహేందర్



మహేందర్‌కు స్వీట్లు తినిపిస్తున్న కుటుంబ సభ్యులు

బాసర: మండలంలోని కిర్గుల్ (బి) గ్రామానికి చెందిన కరండే మహేందర్ గ్రూప్-1లో 471 మార్కులతో జనరల్ ర్యాంక్ 219 సాధించి డీఎస్పీగా ఎంపికయ్యాడు. ఉజ్వల-సంజీవ్ దంపతులు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కుమారుడు మహేందర్ చిన్నప్పటి నుంచి చదువులో రాణిస్తూ, తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉండేవాడు. 2017లో ఎస్టీటీ ఉపాధ్యాయుడిగా, 2020లో సివిల్ ఎస్సైగా ఎంపికై సాధించాడు. నేరడిగొండలో ఎస్సైగా, నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణం పరిధిలోని రుద్రూర్‌లో ఎస్సైగా విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం గుడిహత్నూర్ ఎస్సైగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయన గ్రూప్-1లో డీఎస్పీగా ఎంపికవడంపై స్వగ్రామంలో ప్రజలు అభినందనలు తెలిపారు. గురువులు నేర్పిన పాఠాలే నాకు ఆదర్శమని, అమ్మానాన్నల కష్టం వృథా కాకుండా పోలీసు ఉద్యోగం వచ్చినందుకు సంతోషంగా ఉందని మహేందర్ తెలిపాడు.

అదనపు కలెక్టర్ భార్యకు 68వ ర్యాంక్



బరీరా ఫరీద్

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ స్థానిక సంస్థల అదనపుకలెక్టర్ ఫైజాన్ అహ్మద్ భార్య బరీరా ఫరీద్ రాష్ట్రస్థాయిలో 68వ ర్యాంక్ (బీసీ ఈ కేటగిరీలో ప్రథమ ర్యాంకు) సాధించింది. ఈమె..ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టర్ ఆఫ్ ఫార్మసీ డిగ్రీని పూర్తిచేసింది. సివిల్ సర్వీసెస్‌కు సన్నద్ధమవుతూ 2022లో సివిల్స్‌లో ఇంటర్వ్యూ వరకు వెళ్లింది. హైదరాబాద్‌కు చెందిన షేక్ ఫరీరుద్దీన్, షమీన్ ఉన్నిసా దంపతుల ఏడుగురు సంతానంలో చివరి వ్యక్తి ఈమె. తండ్రి భారత వాయుసేనలో రిటైర్డ్ ఉద్యోగి. గ్రూప్-1లో 68వ ర్యాంక్ సాధించిన బరీర ఫరీద్‌కు అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, కుటుంబసభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

సత్తాచాటిన ఆవుడం యువకుడు



అమ్మానాన్నలతో సుమంత్‌గౌడ్

నెన్నెల: మండలంలోని ఆవుడం గ్రామానికి చెందిన మండల సుమంత్‌గౌడ్ సత్తా చాటారు. రాష్ట్ర స్థాయిలో 286వ ర్యాంకు, మల్టీజోన్‌లో 126వ ర్యాంకు సాధించారు. గతంలో గ్రూప్-2, 3, 4లో ఉత్తమ ర్యాంకులు సాధించారు. ప్రస్తుతం జీహెచ్ఎంసీలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గ్రూప్-2లో రాష్ట్ర స్థాయిలో 172వ ర్యాంకు, గ్రూప్-3లో 102వ ర్యాంకు, గ్రూప్-4లో 88వ ర్యాంకు దక్కించుకున్నారు. గ్రూప్-1 సాధించడమే లక్ష్యంగా కోచింగ్ లేకుండా రోజుకు 10 గంటలు కష్టపడి చదివానని తన కష్టానికి తగిన ర్యాంకు వచ్చిందని సుమంత్ సంతోషం వ్యక్తం చేశాడు.

కొలువు చేస్తూనే..మరో కొలువు..



విష్ణునందన్

దండేపల్లి: మండల కేంద్రానికి చెందిన పాత రమేశ్-కేసరి దంపతుల పెద్దకుమారుడు పాత విష్ణునందన్ గ్రూప్-1లో 476.5 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో 166వ ర్యాంకు సాధించాడు. విష్ణునందన్ ఇటీవల గ్రూప్-4లో ఉద్యోగం సాధించి హార్టికల్చర్ విభాగంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. గ్రూప్-1లో మంచి ర్యాంకు సాధించినందుకుగాను కుటుంబీకులు, బంధువుల సంతోషం వ్యక్తం చేశారు.

బైంసావాసికి 157వ ర్యాంకు



సాయికుమార్

బైంసాటౌన్: పట్టణంలోని అయోధ్యనగర్‌కు చెందిన సుర్వే సాయికుమార్ గ్రూప్-1లో 157వ ర్యాంకు సాధించాడు. లోకేశ్వరం మండలం పొట్‌పెల్లి(బి)కి చెందిన రత్నమాల-సిద్దేశ్వర్ దంపతులు కొన్నేళ్లుగా బైంసాలో నివాసముంటున్నారు. వీరి కుమారుడు సాయికుమార్ తిరుచ్చిలోని ఎన్ఐటీలో బీటెక్ పూర్తి చేశాడు. కొద్దిరోజులు గుర్గావ్‌లోని మారుతి సుజుకీ కంపెనీలో పనిచేశాడు. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్న లక్ష్యంతో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యాడు. ఈక్రమంలో గ్రూప్-2లో 1907, గ్రూప్-3లో 744 ర్యాంకు సాధించాడు. ప్రస్తుతం గ్రూప్-1లోనూ సత్తాచాటాడు. యూపీఎస్సీ(సివిల్ సర్వీసెస్) సాధించడమే తన లక్ష్యమని పేర్కొన్నాడు.

బండల్‌నాగాపూర్ వాసి ప్రతిభ



సచిన్‌రెడ్డి

తాంసి: మండలంలోని బండల్‌నాగాపూర్‌కు చెందిన సురుకుంటి సచిన్‌రెడ్డి గ్రూప్-1లో 454.5 మార్కులతో రాష్ట్రస్థాయిలో 503 ర్యాంక్ సాధించాడు. ఇప్పటికే గ్రూప్-4 ఫలితాల్లో ప్రతిభ కనబర్చి ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయంలో వార్డు ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ముంబయిలో ఇంజినీరింగ్ పూర్తిచేశాడు. సివిల్స్ సాధించడమే లక్ష్యమని సచిన్‌రెడ్డి పేర్కొన్నాడు. ఈయన తల్లిదండ్రులు మంజుల-శ్రీధర్ రెడ్డి రాజకీయాల్లో కొనసాగుతున్నారు. గ్రూప్-1లో రాష్ట్రస్థాయిలో ర్యాంక్ సాధించిన సచిన్‌రెడ్డిని పలువురు అభినందించారు.

పండుగపూట విషాదం

- దైవ దర్శనానికి వెళ్లి..కానరాని లోకాలకు
- శంకర్‌లొద్ది గుండంలో పడి యువకుడి మృతి



పవార్ శంకర్ (ఫైల్)



పవార్ శంకర్ మృతదేహం

నార్నూర్: ఉగాది పండుగపూట విషాదం నెలకొంది. దైవ దర్శనానికి వెళ్లి శంకర్ లొద్ది గుండంలో పడి యువకుడు మృతిచెందాడు. కుమురం భీం జిల్లా కెరమెరి మండలం శంకర్‌లొద్ది గుండం వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. నార్నూర్ మండలంలోని గంగాపూర్ తండా చెందిన పవార్ సంగీత-ఉత్తం దంపతులకు ఇద్దరు సంతానం. ఒక కూతురు పెళ్లయింది. ఒక కుమారుడు పవార్ శంకర్ (22) ఉన్నాడు. శంకర్ బొలెరో వాహన డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. దంపతులిద్దరు శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ దీక్షలో ఉన్నారు. ఉగాది సందర్భంగా కెరమెరి మండలంలోని శంకర్‌లొద్దిలో శివలింగం గుహలో దర్శనంతోపాటు దీక్ష గురువు శ్రీ సద్గురు ప్రేంసింగ్ మహారాజ్ దీక్ష చేపట్టిన పుణ్యస్థలం కావడంతో సేవాలాల్ భక్తులు, మాలధరించిన వారు వందల సంఖ్యలో వెళ్లారు. దీక్షలో ఉన్న దంపతులిద్దరు ఆదివారం కుమారుడిని వెంట తీసుకెళ్లారు. గుహ ముందు ఉన్న వాగులో స్నానానికి బండపై నుంచి దూకాడు. నీటిలో రెండు రాయి మధ్య ఇరుక్కుని మునిగి చనిపోయాడు. గంగాపూర్ తండా గ్రామం శోకసంద్రంలో మునిగింది. కుమారుడు మృతితో కుటుంబ సభ్యుల కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు కెరమెరి ఎస్సై విజయ్ తెలిపారు.


అమ్మవారికి వెండివీణ బహూకరణ



దాతలు బహూకరించిన వీణ

బాసర: బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారికి దాతలు ఆదివారం వెండివీణ బహూకరించారు. నిజామాబాద్ జిల్లాలోని నవ్యభారతి గ్లోబల్ హైస్కూల్ సంస్థ చైర్మన్ క్యాతం శ్రీదేవి-సంతోష్ దంపతులు రూ.5 లక్షలతో 4 కేజీల వెండితో తయారు చేయించిన వెండి వీణను బహూకరించారు. అర్చకులు దాతలకు తీర్థప్రసాదం అందజేసి వారిని శాలువా కప్పి సత్కరించారు.

చిల్డ్రన్ గ్రౌండ్స్‌లో చీకట్లు



నందనవనంలో చీకటిగా ఉన్న చిల్డ్రన్ ప్లే గ్రౌండ్

శ్రీరాంపూర్: సింగరేణి చిల్డ్రన్ గ్రౌండ్స్‌లో చీకటి అలుముకుంది. చిన్నపాటి ఏర్పాట్లకు కూడా అధికారుల నిర్లక్ష్యం వల్ల పిల్లలకు ప్రమాదంగా మారింది. శ్రీరాంపూర్ ఏరియా పరిధిలోని నస్పూర్ కాలనీలోని రెండు చిల్డ్రన్ ప్లే గ్రౌండ్స్‌లలో లైటింగ్ సమస్య తీవ్రంగా ఉంది. నస్పూర్ కాలనీలోని మనోరంజన్ సముదాయం ఆవరణ, ఆర్కే5 కాలనీ వద్ద గల నందన వనం పార్కులోని చిల్డ్రన్ ప్లే గ్రౌండ్‌లు ఉన్నాయి. పిల్లల కోసం జారుడు బండ, ఉయ్యాలు, రంగుల రాట్నం తదితర ఆటలు ఆడుకోవడానికి ప్లేగ్రౌండ్‌లు ఏర్పాటు చేశారు. అయితే ఇందులో లైటింగ్ అధ్వానంగా ఉంది. ఉన్న కొన్ని పని చేస్తున్నాయి. మిగతావి చెడిపోయి వెలగడం లేదు. చీకటి పడితే చాలు పిల్లలు ఆడుకోవడానికి భయపడుతున్నారు. వేసవి కావడంతో సాయంత్రం వేళ పిల్లలతో మైదానాలు కిక్కిరిపోస్తున్నాయి. మరో పక్క పక్కనే చెట్లపొదలు ఉండటంతో విషకీటకాలు, విషసర్పాలు వస్తున్నాయి. దీంతో ఎప్పుడేం ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

తగ్గుతున్న ఎల్లంపల్లి నీటిమట్టం



ఎల్లంపల్లి జలాశయం

ఎల్లంపల్లి(శ్రీపాదసాగర్) ప్రాజెక్ట్ నీటిమట్టం రోజురోజుకు తగ్గుముఖం పడుతోంది. ఇటు వేసవి కాలం పైగా ఇతర ప్రాంతాల అవసరాలకు నీటిని తరలిస్తుండటంతో తగ్గుతోంది. ప్రాజెక్ట్ మట్టం 148 మీటర్ల క్రస్ట్ లెవెల్ కాగా 143 మీటర్లకు చేరగా 20.175 టీఎంసీలకు గాను 10 టీఎంసీల నీటి సామర్థ్యంతో ఉంది. ప్రాజెక్ట్‌కు ఇన్‌ఫ్లో లేకపోగా అవుట్ ఫ్లో కింద గూడెం ఎత్తిపోతల పథకానికి 290 క్యూసెక్కులు, హైదరాబాద్ మెట్రోవాటర్ వర్క్స్ సుజల స్రవంతి పథకానికి 324, ఎన్టీపీసీకి 242, నంది పంప్‌హౌజ్‌కు 3,150 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు.

– మంచిర్యాలరూరల్(హాజీపూర్)

నేడే రంజాన్

- మసీదులు, ఈద్గాలు ముస్తాబు
- ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు పూర్తి



నెన్నెల/కెరమెరి: పవిత్ర రంజాన్ ఉపవాస దీక్షలు ఆదివారంతో ముగిశాయి. ముస్లింలు నెల రోజుల దీక్షలు పూర్తికావడం, సాయంత్రం ఆకాశంలో షవ్వాల్ నెలవంక దర్శనమిచ్చింది. సోమవారం పండుగను జరుపుకునేందుకు అంతా సిద్ధమయ్యారు. ఉమ్మడిజిల్లాలోని ఈద్గాలు, మసీదులన్నీ ఇప్పటికే ముస్తాబయ్యాయి. ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. పండుగ ప్రాముఖ్యతపై 'సాక్షి'కథనం.

ఈద్-ఉల్-ఫితర్ అంటే..

ఉపవాసదీక్షలు పాటించిన ముస్లింలు నెల అనంతరం షవ్వాల్ నెల మొదటిరోజు జరుపుకునే పండుగే ఈద్- ఉల్-ఫితర్. ఉదయాన్నే స్నానాలు చేసి, కొత్త బట్టలు ధరించి, అత్తర్ పూసుకొని, కళ్లకు కుర్మా పెట్టుకొని చిన్నా, పెద్దలంతా కలిసి ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ శుభాకాంక్షలు చెప్పుకుంటారు. పండుగ రోజు బంధువులు, స్నేహితులను ఇంటికి పిలిచి షీర్ ఖుర్మా (సేమియా)తో విందు ఏర్పాటు చేస్తారు. తామంతా ఒకేభావన, ప్రేమాభిమానాలు, సమైక్యత, సామరస్యాలు నెలకొల్పడంలో ఈ పండుగ ప్రముఖ పాత్ర పోషిస్తుంది.

జకాత్: ఇస్లాం నిర్దేశించిన సిద్ధాంతాల్లో జకాత్ నాల్గోది. జకాత్ అనగా దానం. ఇది మానవుల్లో త్యాగం, సానుభూతి, సహకారాలను పెంపొందిస్తుంది. ప్రతిఒక్కరూ తమకు ఉన్న దానిలో అవసరం ఉన్నవారికి ఇంత ఇచ్చి ఆదుకోవాలి. తమ వద్ద ఉన్న బంగారం, వెండి, రొక్కం, ఆ సంవత్సరం పండిన పంట, వ్యాపారం కోసం నిర్దేశించిన సరుకులు చివరికి తమ వద్ద ఉన్న పశువులను వెలకట్టి అందులో నుంచి 2.5 శాతం విధిగా దానం చేయాల్సి ఉంటుంది. నిరుపేదలు ఆనందోత్సాహాల మధ్య పండుగ జరుపుకోవాలనేది జకాత్ సిత్రాల ముఖ్య ఉద్దేశం.

ప్రత్యేక తరావీ నమాజ్‌లు: ప్రతీరోజు రాత్రి 8.30 నుంచి 10 గంటల వరకు ఈ మాసంలో ప్రత్యేకంగా తరావీ నమాజ్‌లు చేస్తారు. దివ్యఖురాన్‌ను రోజుకు 20 రకాతుల చొప్పున తరావీ నమాజ్‌లో 27 రోజుల పాటు హాఫీజ్‌లు పటిస్తారు. రాత్రి ఇషా నమాజ్ అనంతరం తరావీ నమాజ్ జరుగుతుంది. ఇలా 25 రోజుల తర్వాత 26వ రోజు సభ్యఖదర్ రాత్రి ప్రత్యేక ప్రార్థనలు జరుపుతారు. 30 రోజుల ఉపవాస దీక్ష పాటించలేని వారు 26 రోజుల తర్వాత వచ్చే సబ్ ఏ ఖదర్ రాత్రి నుంచి ఈద్ ఉల్ ఫీతర్ వరకు ఉపవాస దీక్షను ఆచరిస్తారు. ఇహ లోకంలో ఆచరించే ఈ కఠోర దీక్షలు మనల్ని పరలోకంలో రక్షణగా ఉండి కాపాడుతాయని ముస్లింల ప్రగాఢ విశ్వాసం.

ఫిత్రాదానం: షవ్వాల్ నెల మొదటి తేదీ ఈద్-ఉల్-ఫితర్ పండుగ. నాడు నమాజ్ ప్రార్థనకు ముందు పేదలకు ఇచ్చే దానమే ఫిత్రా. అందుకే ఈ పండుగను ఈద్-ఉల్-ఫిత్ర్ అని పేరు వచ్చింది. షరియత్ పరిభాషలో ఫిత్ర అంటే ఉపవాసాల పాటింపులో మనిషి ఎన్ని జాగ్రత్తలు తీసుకున్న పొరపాట్లు జరుగుతుంటాయి. వీటిని పరిహారం చేసేదే ఫిత్రాదానం. పావుదక్కువ రెండుసేర్లు గోధుమలు తూకానికి సరిపడా పైకాన్ని నిరుపేదలకు ప్రతి ముస్లిం దానం చేయాలి.

స్థోమత ఉన్నవారంతా ఇవ్వాలి



ఆర్థికస్థోమత ఉన్నవారు జకాత్ చేయాలి. సొంతంగా సంపాదించిన దాని నుంచే దానం చేయాలి. రుణగ్రస్తులైతే ఇందులో అర్హులు కారు. వర్షాధారంగా పండే ఫలాలు, ధాన్యంపై పదో వంతు, బావులు, బోర్లు ఆధారంగా పండే వాటిపై ఐదో వంతు జకాత్ ఇవ్వాలి. – షేక్ హైదర్, ఇమాం, కెరమెరి

ఓలాలో భారీ అగ్నిప్రమాదం

- యంత్రాలు, కలప దగ్ధం



కాలిపోయిన విలువైన కలప

కుంటాల: మండలంలోని ఓలా గ్రామంలో శనివారం అర్ధరాత్రి భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన యువకులు వేల్పూర్ రంజిత్, రాజశేఖర్, రాకేశ్ వడ్రంగి కులవృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇంటి పక్కనే గల మూడు షెడ్లు వేర్వేరుగా ఏర్పాటు చేసుకుని అనుమతి పొందిన టేకు కలపతో గృహ నిర్మాణ, పెళ్లిళ్ల పనులకు అవసరమయ్యే ఫర్నిచర్‌ను తయారు చేస్తుంటారు. శనివారం ప్రమాదవశాత్తు షెడ్లలో మంటలు చెలరేగాయి. పక్కనే నిద్రిస్తున్న మహారాష్ట్ర కూలీలకు మంటల వేడిని గమనించి కుటుంబ సభ్యులను అప్రమత్తం చేశారు. అప్పటికే మంటలు ఎగిసిపడి షెడ్లలో ఉన్న టేకు కలప, యంత్రాలు, సామాగ్రి పూర్తిగా దగ్ధమయ్యాయి.

రూ.34 లక్షల ఆస్తినష్టం..

ఉగాది అమావాస్య పురస్కరించుకుని శనివారం వేల్పూర్ రంజిత్, రాజశేఖర్, రాకేశ్‌లు రైతులకు అవసరమయ్యే అరక పనులు చేసి నిద్రించారు. ఒకేసారి షెడ్లలో మంటలు వ్యాపించడంతో అందులో ఉన్న కలప, యంత్రాలు, వస్తువులు అగ్నికి బుగ్గిపాలయ్యాయి. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది వచ్చి మంటలార్పి వేశారు. రంజిత్‌కు షెడ్‌లో ఉన్న రూ.8 లక్షల కలప, రూ.3 లక్షల విలువ చేసే యంత్రాలు, సామగ్రి, రాజశేఖర్‌కు షెడ్‌లో రూ.10 లక్షల కలప, రూ.3 లక్షల యంత్రాలు, సామగ్రి, రాకేశ్ షెడ్‌లో ఉన్న రూ.5 లక్షల కలప, రూ. 5 లక్షల యంత్రాలు, పనిముట్లు కాలి బూడిదయ్యాయి. రూ.34 లక్షల ఆస్తినష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు. ఘటనా స్థలాన్ని ఎస్సై సి.అశోక్ పరిశీలించారు. ప్రభుత్వం తమను ఆదుకుని నష్టపరిహారం అందించాలని వేడుకున్నారు.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి మృతి

ఉమ్మడి జిల్లాలో వేర్వేరు ఘటనల్లో ముగురు మృతిచెందారు. రోడ్డు ప్రమాదంలో ఒకరు, చికిత్స పొందుతూ వృద్ధుడు, మద్యానికి బానిసై మరొకరు మృతిచెందారు.

దిలావర్‌పూర్: మండలంలోని న్యూలలోం సమీపంలో శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందాడు. నిర్మల్-భైంసా రహదారిపై కాల్వ ఆలయ స్వాగత తోరణం వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతిచెందగా వాహనదారులు గమనించి ఎస్సై సందీప్‌కు సమాచారం అందించారు. అక్కడికి చేరుకుని ప్రమాదం తీరుపై ఆరా తీశారు. మృతుడు నర్సాపూర్(జి) మండలం బామ్ని గ్రామానికి చెందిన గోడ్సె కిషన్‌రావు (55)గా గుర్తించారు. నిర్మల్ పట్టణానికి వెళ్లి కాలినడకన రోడ్డు గుండా వస్తుండగా వాహనం ఢీకొనడంతో మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిర్మల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు..

మంచిర్యాలక్రైం: జీవితంపై విరక్తితో మద్యం మత్తులో గుర్తుతెలియని పురుగుల మందు తాగిన వృద్ధుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఏఎస్సై బి.సత్తయ్య కథనం ప్రకారం.. జిల్లాకేంద్రంలోని అశోక్‌రోడ్‌కు చెందిన సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి జింక దుర్గయ్య(71) గత కొంతకాలంగా మద్యానికి బానిసై అనారోగ్యానికి గురయ్యాడు. ఆసుపత్రిలో చూపించగా లివర్ పాడైపోయిందని వైద్యులు చెప్పారు. అయినా దుర్గయ్య మద్యం తాగేవాడు. జీవితంపై విరక్తితో ఈనెల 28న మద్యం మత్తులో గుర్తుతెలియని పురుగుల మందు తాగి భార్య సమ్మక్కకు విషయం చెప్పాడు. వెంటనే మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతు ఆదివారం మృతిచెందాడు. మృతురాలి భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

తాగుడుకు బానిసై వ్యక్తి..



వివరాలు తెలుసుకుంటున్న ఎస్సై

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన బోయర్ దేవిదాస్ (55) గత కొన్నేళ్లుగా తాగుడుకు బానిసయ్యాడు. ఇంటి నుంచి వెళ్లిపోయాడు. పట్టణంలోని రోడ్లపై తిరుగుతూ జీవనం సాగించేవాడు. ఆదివారం భుక్తాపూర్‌లోని బి-రాములు కాంప్లెక్స్ సమీపంలో గల ఓ తోపుడుబండిపై చనిపోయి ఉన్నాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారమందించగా మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించారు. ఈమేరకు వన్‌టౌన్ ఎస్సై అశోక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాసరలో పంచాంగ శ్రవణం



పంచాంగ శ్రవణంలో అర్చకుడు



పాల్గొన్న భక్తులు

బాసర: విశ్వావసు నామ సంవత్సరం సందర్భంగాబాసర శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారి సన్నిధిలోఆదివారం ఉగాది వేడుకలు, పంచాంగ శ్రవణం నిర్వహించారు. అర్చకుడు ప్రదీప్ దీక్షిత్.. 12 రాశుల ఫలితాలు ఆదాయ వ్యయాలు రాజ్యపూజ్య అవమానాలను తెలియజేశారు. అనంతరం స్థానికులు, భక్తులు అమ్మవారికి ప్రత్యేకపూజలు చేశారు. బాసర శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గ్రామస్తులకు అర్చకులు పంచాంగ శ్రవణం వివరించారు.